
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం । 31 । జనవరి । 2025



సోమశిలలో 67.286 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో గురువారానికి 67.286 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 1840 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.83,530
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,608
మూడు శాతం జీఎస్టీతో	రూ.7,856
సవర (8 గ్రాములు)	రూ.62,688

గరిష్టం/కనిష్టం
32.1 21.5

వాతావరణం

జిల్లాలో వాతావరణం శుక్రవారం సాధారణంగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 64 శాతంగా గురువారం నమోదైంది.

న్యూస్‌రీల్

వైస్ చైర్మన్ల ఎన్నికలో పోటీకి సిద్ధం



ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీకి ఫిబ్రవరి మూడున నిర్వహించనున్న వైస్ చైర్మన్ల ఎన్నికలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోటీ చేయనుందని మాజీ మంత్రి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు పార్టీ నేతలతో గురువారం చర్చించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో తమ పార్టీ తరఫున గెలుపొందిన 18 మంది కౌన్సిలర్లకు విప్‌ను జారీ చేయనున్నామని చెప్పారు. అధికార అండతో తొమ్మిది మంది కౌన్సిలర్లను టీడీపీలో చేర్చుకున్నారని, ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్తామన్నారు. విప్‌ను ధిక్కరించి పార్టీకి వ్యతిరేకంగా ఓటేసిన వారిని అనర్హులుగా ప్రకటించనున్నారని చెప్పారు. పోటీ విషయంలో వెనుకడుగేసేదిలేదని తేల్చిచెప్పారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావు పాల్గొన్నారు.

నేటి నుంచి మోగనున్న పెళ్లిబాజాలు

- మే 18 వరకు శుభ ముహూర్తాలు

ఆత్మకూరు రూరల్: అతి పవిత్రంగా భావించే మాఘమాసం ప్రారంభమైన నేపథ్యంలో వివాహ వేడుకలతో తెలుగు లోగిళ్లలో సందడి శుక్రవారం ప్రారంభం కానుంది. పెళ్లిబాజాలు మోగేందుకు ఇప్పటికే ముహూర్తాలు నిర్ణయమైపోయాయి. ఫిబ్రవరిలో అధికంగా శుభ ముహూర్తాలున్నాయని వేదపండితులు తెలిపారు. ఫిబ్రవరిలో 2, 3, 7, 13, 14, 15, 18, 19, 20, 21, 23, 25వ తేదీలు.. మార్చిలో 1, 2, 6, 7, 12వ తేదీలు.. ఏప్రిల్‌లో 14, 16, 18, 19, 20, 21, 25, 29, 30వ తేదీలు.. మేలో 1, 5, 6, 8, 15, 17, 18.. జూన్‌లో 1, 2, 4, ఏడో తేదీల్లో మాత్రమే పెళ్లి ముహూర్తాలున్నాయి. దీంతో తమ పిల్లల వివాహాలు చేయాలనుకుంటున్న తల్లిదండ్రులు తమకు అనుకూలమైన శుభ ముహూర్తం కోసం అవసరమైన యత్నాలు చేసుకుంటున్నారు.

రాజరాజేశ్వరి ఆలయంలో వేలం


నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో 2025 – 26కు సంబంధించిన హక్కులను లీజుకు ఇచ్చేందుకు, అవసరమైన సామగ్రిని సరఫరా చేసేందుకు ఈ – టెండర్, సీల్డ్ టెండర్, బహిరంగ వేలాన్ని గురువారం నిర్వహించారు. ఎనిమిది విభాగాలకు గానూ కొబ్బరి చిప్పలు, పాదరక్షలు, పుస్తకాలకు సంబంధించిన వేలాన్ని జరిపారు. మిగిలిన వాటి వేలాన్ని ఫిబ్రవరి పదిన నిర్వహించనున్నామని ఈఓ జనార్దన్‌రెడ్డి తెలిపారు. పర్యవేక్షణాధికారిగా శ్రీధర్‌నాయుడు వ్యవహరించారు.

పెంచలకోనలో 4న రథసప్తమి

రాపూరు: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో రథసప్తమి వేడుకలను ఫిబ్రవరి నాలుగున నిర్వహించనున్నామని అధికారులు తెలిపారు. పెనుశిల లక్ష్మీనృసింహుడు సప్త వాహనాల్లో విహరించి భక్తులను అనుగ్రహించనున్నారని చెప్పారు.



మరో బాదుడు



పెరిగిన విద్యుత్ చార్జీలు.. ఆకాశాన్నంటుతున్న నిత్యావసర సరుకుల ధరలు.. తారెత్తిస్తున్న కూరగాయల రేట్లతో ప్రజల హాహాకారాలు మిన్నంటిన వేళ.. వారిపై మరో బాదుడు మోపేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. స్థలం.. నూతన గృహాన్ని కొనుగోలు చేయాలనే సామాన్యుల ఆశను చిదిమేసే దిశగా అడుగులేస్తోంది. మార్కెట్ విలువలను భారీగా పెంచి అందిన కాడికి దండుకోవడమే ధ్యేయంగా స్కెచ్ వేసింది. జిల్లాలో పది శాతం నుంచి 50 శాతం వరకు పెంచడంతో రిజిస్ట్రార్ కార్యాలయాలకు రావాలంటేనే సామాన్యులు జంకే పరిస్థితికి సర్కార్ తీసుకొచ్చింది.

కూటమి ప్రభుత్వంలో ప్రజలకు వరుస షాక్‌లు

- రేపట్నుంచి మార్కెట్ విలువల పెంపు
- జిల్లాలో 10 శాతం నుంచి 50 శాతం వరకు పెరుగుదల
- ఇప్పటికే రియల్ ఎస్టేట్ రంగం ఢమాల్
- తాజా నిర్ణయంతో మరింత పతనమయ్యే అవకాశం

నెల్లూరులో ఇదీ పరిస్థితి.. మార్కెట్ విలువ (చదరపు గజం)

ప్రాంతం	ప్రస్తుతం(రూ.)	పెరిగాక (రూ.)
చిన్నబజార్	46,000	50,600
ఆచారి వీధి	38,000	41,800
అలంకార్ సెంటర్	23,000	26,000
పోలీస్ కాలనీ	4100	4800
శాంతినగర్	8200	9500
నవాబుపేట	28,000	32,000
బాలాజీనగర్	15000	17,000
స్టోన్‌హౌస్‌పేట	28,000	32,000
అల్లీపురం	4000	4600
వావిలేటిపాడు	4000	4600

జిల్లాలో ఇలా..

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు	పెరగనున్న శాతం
నెల్లూరు (ప్రధాన, స్టోన్‌హౌస్‌పేట, బుజబుజనెల్లూరు)	10 నుంచి 15
కావలి	15 నుంచి 50
కోవూరు	ఐదు నుంచి 25
ఇందుకూరుపేట	20 నుంచి 50
బుచ్చిరెడ్డిపాళెం	17 నుంచి 33
ఉదయగిరి, వింజమూరు, రాపూరు, ముత్తుకూరు, అల్లూరు, ఆత్మకూరు, పొదలకూరు	10 నుంచి 50
కందుకూరు	15 నుంచి 30

నెల్లూరు సిటీ: భూ బాదుడుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా 50 శాతం వరకు మార్కెట్ విలువలను పెంచాలనే నిర్ణయం తీసుకుంది. దీనికి ముహూర్తంగా ఫిబ్రవరి ఒకటో తేదీని ఖరారు చేసింది. వాస్తవానికి వీటిని జనవరి ఒకటి నుంచే పెంచాలని భావించినా, కొన్ని కారణాలతో వాయిదా వేశారు. మరోవైపు జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ అధికారులతో సమావేశాలను జాయింట్ కలెక్టర్ ఈ నెల్లో నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు మార్కెట్ విలువల పెంపుపై చర్చించారు. ఈ క్రమంలో జిల్లాలో పది శాతం నుంచి 50 శాతం వరకు పెరగనున్నాయి. జిల్లాలో 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. నగరంలో ప్రధాన రిజిస్ట్రేషన్, స్టోన్‌హౌస్‌పేట, బుజబుజనెల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి.

రియల్ ఎస్టేట్‌పై తీవ్ర ప్రభావం

మార్కెట్ విలువలను పెంచాలనే ప్రభుత్వ నిర్ణయం రియల్ ఎస్టేట్ రంగానికి అశనిపాతంలా పరిణమించింది. నిజానికి గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుంది. ప్లాట్ల కొనుగోళ్లు నిత్యం జరిగేవి. దీంతో ఈ వ్యాపారంలోకి వివిధ రంగాల వారు ప్రవేశించారు. ఈ తరుణంలో కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చాక రియల్ ఎస్టేట్ ఒక్కసారిగా కుదేలైంది. రిజిస్ట్రేషన్ల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. భూముల విలువలను భారీగా పెంచడం దీన్ని కోలుకోలేని విధంగా దెబ్బతీయనుంది. దీనిపై స్థిరాస్తి వ్యాపారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిపాదనలకు ఆమోద ముద్ర

ఈ వ్యవహారంలో జిల్లాలోని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ అధికారులు కసరత్తు పూర్తి చేశారు. ప్రతిపాదనలకు ఇప్పటికే ఆమోద ముద్ర వేశారని తెలుస్తోంది. మార్కెట్ విలువల పెంపుపై అధికారిక ప్రకటన విడుదల చేయడమే ఇక తరువాయి.

స్థలాలను లాక్కుంటాం..

ఎప్పటికైనా ఇంటిని నిర్మించుకోవాలనేది ఎంతో మంది ఆకాంక్ష. ఇందులో భాగంగా స్థలాన్ని కొనుగోలు చేసినా, ఆర్థిక పరిస్థితులు అనుకూలించక.. వాటిని కొంత కాలం ఖాళీగా వదిలేస్తారు. వీటికి వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్‌ను చెల్లించాల్సి ఉన్నా, వాటిని కట్టడంలో కొంత జాప్యం జరుగుతుంది. అయితే వీటిని ఎలాగైనా సేకరించి, పన్నుల వసూళ్లలో నెల్లూరు ముందుందనే రీతిలో కనపడాలనే తాపత్రయంతో మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ అడుగులేస్తున్నారు. అనుకున్నదే తరువాయిగా పన్నులు చెల్లించకపోతే ఆస్తులను స్వాధీనం చేసుకుంటామని బాహాటంగా బెదిరిస్తూ బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు. ఈ వ్యవహారంలో నగరపాలక సంస్థ అధికారులు అవలంబిస్తున్న తీరుపై యజమానులు భగ్గుమంటున్నారు.

- పన్ను కట్టరా.. అయితే అంతే..!
- నెల్లూరు కార్పొరేషన్ దుర్మార్గ పోకడ
- ఆస్తులను స్వాధీనం చేసుకుంటామంటూ బోర్డుల ఏర్పాటు
- బెదిరింపులతో భయభ్రాంతులకు గురిచేస్తూ..
- మంత్రి నారాయణ ఏకపక్ష నిర్ణయం
- భగ్గుమంటున్న యజమానులు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడు నెలల్లో సంక్షేమం మాట అటుంచితే, ప్రజలను ఎలా పీక్కుతినాలనే అంశంపైనే ఎక్కువ కసరత్తు సాగిస్తున్నారు. ఇప్పటికే ప్రజలపై భారం మోపుతూ వికటాట్టహాసం చేస్తున్న పాలకులు తాజాగా మరో దుర్మార్గ పోకడకు శ్రీకారం చుట్టారు. సాధారణంగా ఖాళీ స్థలాలున్న యజమానులు వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్‌ను చెల్లించాల్సి ఉంది. వీటిని ముందో.. వెనుకో చెల్లించే వెసులుబాటు ఉంది. అయితే నెల్లూరులో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా సాగుతోంది. పన్నులను వెంటనే చెల్లించకపోతే స్థలాన్ని స్వాధీనం చేసుకుంటామంటూ బోర్డులను కార్పొరేషన్ అధికారులు పెడుతున్నారు. నగరపాలక సంస్థలో సాగుతున్న ఈ దారుణంపై ప్రైవేట్ స్థలాల యజమానులు భగ్గుమంటున్నారు.

> ఈ చిత్రంలో కనిపిస్తున్న స్థలం నెల్లూరు రూరల్ పరిధిలోని 385 / 2 సర్వే నంబర్‌లో ఉంది. దీనికి సంబంధించిన పన్నులను చెల్లించకపోవడంతో బోర్డును నగరపాలక సంస్థ అధికారులు రెండు రోజుల క్రితం ఏర్పాటు చేశారు. దీన్ని స్వాధీనం చేసుకున్నామని, సమాచారం కోసం అధికారులను సంప్రదించాలని అందులో పొందుపర్చారు. ప్రైవేట్ స్థలంలో బోర్డును చూసి ఆందోళనకు గురవడం యజమానుల వంతైంది.

ఎవరి దారి వారిదే..

పన్నులను వసూలు చేయడం మంచిదేనైనా, కార్పొరేషన్ అధికారులు అనుసరిస్తున్న వైఖరే వివాదాస్పదంగా మారుతోంది. కఠిన నిర్ణయాలతో మంత్రి నారాయణ దూకుడు పెంచగా.. పన్నుల కోసం పీడిస్తే నగరవాసుల కోసం రోడ్డెక్కుతానని పుష్ప సినిమా తరహాలో మాస్ వార్నింగ్‌లను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఇస్తున్నారు. ఈ తరుణంలో తగ్గేదేలే అనే రీతిలో మంత్రి సాగుతుండటం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.



ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

ఇదేమి నిర్ణయమో..?

వాస్తవానికి ఖాళీ స్థలాలకు సంబంధించిన పన్ను బకాయిలను చెల్లించకపోతే నోటీసులను జారీ చేసి.. అప్పటికీ స్పందించకపోతే చట్ట ప్రకారం చర్యలు చేపడతారు. అయితే పన్నులు చెల్లించకపోతే ఏకంగా ప్రైవేట్ ఆస్తులను స్వాధీనం చేసుకుంటామంటూ బోర్డులను నగరపాలక సంస్థ అధికారులు ఏర్పాటు చేయడంపై విస్మయం వ్యక్తమవుతోంది. అధికారుల తీరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో పాటు న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని పలువురు పేర్కొంటున్నారు.

ప్రచారార్భాటానికి తాపత్రయం

కార్పొరేషన్ పరిధిలో ఖాళీ స్థలాలకు సంబంధించి 6,500 అసెస్మెంట్లు ఉండగా, వీటి నుంచి రూ.17.5 కోట్లు వసూలు కావాల్సి ఉంది. మంత్రి నారాయణ మున్సిపల్ మంత్రిగా ఉండటంతో తన శాఖలో పన్నులను భారీగా వసూలు చేస్తున్నామని చిత్రీకరించుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. నగరపాలక సంస్థలో మునుపెన్నడూ లేని విధంగా పన్నుల వసూళ్లే పరమావధిగా దూకుడు పెంచారు. కార్పొరేషన్లో చోటు చేసుకుంటున్న పరిణామాలను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి బాహాటంగా వ్యతిరేకిస్తున్నారు. మంత్రితో విభేదిస్తూనే.. అధికారులపై అసహనం వ్యక్తం చేస్తూ హెచ్చరికలనూ జారీ చేశారు. అయితే వీటిని పట్టించుకోకుండా, తన అనుచరులకు సంబంధించిన ఖాళీ స్థలాల్లో బోర్డులను పెట్టించడంపై ఆయన రగిలిపోతున్నారు. తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధపడుతున్నారని కోటంరెడ్డి అనుచరులే వ్యాఖ్యానిస్తున్నారు.

సామాన్యులపై కన్నెర్ర

మరోవైపు పన్ను చెల్లించని వారి నివాసాలకు విద్యుత్, కుళాయి కనెక్షన్లను కట్ చేస్తామని బెదిరిస్తున్నారు. వాణిజ్య సముదాయాలకు తాళాలేసేందుకు సిద్ధమవుతున్నారు. గత ప్రభుత్వాలు ఇలాంటి చర్యలకు పూనుకోలేదని, ఓట్లేసి గెలిపించిన ప్రజలకు కూటమి ప్రభుత్వమిచ్చే గిఫ్ట్ ఇదేనాననే భావన సర్వత్రా వ్యక్తమవుతోంది.

భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న కార్తీక్

నెల్లూరు రూరల్: భూముల రీ సర్వే, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన సమస్యలను పరిష్కరించాలని ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ ఆదేశించారు. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో నెల్లూరు, ఆత్మకూరు డివిజన్ల పరిధిలోని తహసీల్దార్లు, సర్వేయర్లతో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రీసర్వే గ్రామసభల్లో వచ్చిన అర్జీలను ఆన్‌లైన్లో నమోదు చేసి పరిష్కారం చూపాలని సూచించారు. మండల స్థాయిలో పెండింగ్ అంశాలపై ఆర్డీఓలు రోజూ సమీక్షించాలని కోరారు. ప్రతి మంగళ లేదా బుధవారాల్లో స్టేషన్ హౌస్ ఆఫీసర్, తహసీల్దార్ ప్రజలకు అందుబాటులో ఉండి సివిల్ భూ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. అర్జీల పరిష్కారంలో సాంకేతికంగా ఎదురయ్యే సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. నడికుడి – శ్రీకాళహస్తి రైల్వేలైన్ భూసేకరణ, నష్ట పరిహార వివరాలను కలెక్టరేట్‌కు ఫిబ్రవరి 15లోపు అందించాలని రాపూరు, పొదలకూరు తహసీల్దార్లకు సూచించారు. డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, జిల్లా భూ సర్వే రికార్డుల ఏడీ నాగశేఖర్, కావలి, ఆత్మకూరు ఆర్డీఓలు వంశీకృష్ణ, పావని తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పక్కన చంద్రశేఖర్‌రెడ్డి, విజయకుమార్‌రెడ్డి తదితరులు



జగన్‌దే తుది నిర్ణయం

- డిప్యూటీ మేయర్ పోటీపై మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు): నెల్లూరు నగరపాలక సంస్థలో ఖాళీగా ఉన్న డిప్యూటీ మేయర్ పదవి కోసం పోటీ చేసే విషయంలో తుది నిర్ణయం తమ పార్టీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. రామ్‌జీనగర్‌లోని పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ కార్యాలయంలో పార్టీ నగర, రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జీలు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఆనం విజయకుమార్‌రెడ్డితో పాటు పలువురు కార్పొరేటర్లు, నేతలతో ప్రత్యేక సమావేశాన్ని కాకాణి గురువారం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిప్యూటీ మేయర్ స్థానానికి ఎన్నికను ఫిబ్రవరి మూడున నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల అధికారి నోటిఫికేషన్‌ను జారీ చేశారని చెప్పారు. ఎన్నికల్లో గెలుపొందిన 54 మంది కార్పొరేటర్లు తమ పార్టీకి చెందిన వారని, అయితే వీరిలో కొందరు ద్రోహం చేసి టీడీపీ పంచన చేరారని ఆరోపించారు. పలువురు కార్పొరేటర్లను బెదిరించి, ప్రలోభాలకు గురిచేసి టీడీపీలో మంత్రి నారాయణ చేర్చుకున్నారని ధ్వజమెత్తారు. వీరందరూ వారి అంతరాత్మకు సమాధానం చెప్పుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. కీలకమైన సమయంలో తమ పార్టీకి వీరు అండగా నిలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని పార్టీ అధిష్టానానికి వివరించనున్నామని, తదుపరి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకునే నిర్ణయానికి తామంతా కట్టుబడి ఉంటామని తెలిపారు. టీడీపీ తరఫున డిప్యూటీ మేయర్ అభ్యర్థిని నిలబెట్టి తమ పార్టీ తరఫున విజయం సాధించిన వారితో గెలిపించుకుంటామని చెప్పడమంత దురదృష్టకర పరిస్థితి మరొకటి లేదన్నారు.

ఆగని అక్రమ దందా

- పంతం నెగ్గించుకుంటున్న టీడీపీ నేత
- ట్రాక్టర్లను అడ్డుకుంటే.. మా ఊళ్లో మిమ్మల్ని నిలిపేస్తాం
- రెండో రోజూ కోవూరులో రాకపోకల అడ్డగింత
- ఇసుక మాఫియాకు కొమ్ముకాస్తున్న అధికారులు

కందుకూరు రూరల్: అధికార టీడీపీ నేతలు బరితెగించారు. మండలంలోని కోవూరుకు చెందిన టీడీపీ నేత రమణయ్య ఇసుక అక్రమ దందాలో తన పంతాన్ని నెగ్గించుకుంటున్నారు. పందలపాడు వద్ద పాలేరు వాగులో ఇసుక తవ్వకాలు వద్దంటూ ఆయనకు చెందిన ట్రాక్టర్లను గ్రామస్తులు బుధవారం నిలిపేయడం.. ఈ పరిణామం రుచించని ఆయన కోవూరులో పందలపాడుకు చెందిన వాహనాల రాకపోకలను అడ్డుకున్న విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన పోలీస్, రెవెన్యూ అధికారులు ఇక నుంచి ఇసుక తవ్వకాలు జరగకుండా చూస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

పక్క రోజుకే సీన్ రివర్స్

తాజాగా రమణయ్యకు చెందిన ట్రాక్టర్లు పాలేరులోకి వెళ్లి ఇసుకను గురువారం తరలించసాగాయి. ఎన్నిసార్లు చెప్పినా పంతానికి పోయి సుమారు 20 అడుగుల లోతులో ఇసుకను తవ్వకుంటున్నారని ఆరోపిస్తూ గ్రామస్తులు నిలిపేశారు. ఈ పరిణామం చోటుచేసుకున్న వెంటనే పందలపాడుకు చెందిన ఆటోలు, పాలవ్యాన్లు, ఇతర వాహనాలను కోవూరులో రమణయ్య నిలిపేశారు. దీంతో అధికారులకు సమాచారం వెళ్లడంతో ఇసుక ట్రాక్టర్లను పంపారు. అనంతరం కోవూరులోనూ రాకపోకలు కొనసాగాయి.

అధికారుల వత్తాసు

ఇసుక తవ్వకాలతో తమ గ్రామానికి ప్రమాదం పొంచి ఉందని, భూగర్భ జలాలు అడుగంటుతాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయినా అధికార బలంతో కోవూరు టీడీపీ నేత రమణయ్య ఏ మాత్రం తగ్గడంలేదు. గ్రామస్తులు గురువారం అడ్డుకున్నా, పోలీసులతో బెదిరింపులకు గురిచేసి మరీ తరలించారు. రవాణాను అడ్డుకుంటే మా ఊరి నుంచి వెళ్లనిచ్చే పరిస్థితే లేదంటూ పంతానికి దిగారు. చర్యలు చేపట్టాల్సిన పోలీసులు, రెవెన్యూ అధికారులు ఏ మాత్రం పట్టించుకోకుండా అక్రమార్కులకు వత్తాసు పలుకుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

కనిపించిందా.. మటాషే..!

మరోవైపు మామిడి తోటలు, మంచినీటి పథకాల వద్దకొచ్చిన ఇసుకను తరలిస్తున్నా, అధికారులు చోద్యం చూస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఇసుక తరలింపును రమణయ్య ఆపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఇసుక తవ్వకాలతో పందలపాడు వద్ద పాలేరు వాగులో ఏర్పడిన గొయ్యి



ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లు

ఇసుక తరలింపును నిలిపేయిస్తాం

పందలపాడు వద్ద ఉచిత ఇసుక తరలింపునకు అధికారికంగా ఎలాంటి అనుమతుల్లేవు. ఈ వ్యవహారమై పోలీసులతో కలిసి శుక్రవారం వెళ్లి చర్యలు చేపడతాం. తరలింపును వీఆర్వో ద్వారా నిలిపేయిస్తాం. – ఇక్బాల్, తహసీల్దార్

ఎన్నికల హామీలను నెరవేర్చాలి



మాట్లాడుతున్న శ్రీనివాసరావు, చిత్రంలో సీనియర్‌ నాయకులు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

నెల్లూరు(వీఆర్సీసెంటర్‌): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్‌ చేశారు. నెల్లూరులోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి సర్కారులో రిపబ్లిక్‌డే వేడుకలు నిర్వహించుకునే స్వేచ్ఛ కూడా ప్రజలకు లేకుండా పోయిందని ఆరోపించారు. విజయవాడలో యువకులు, దళిత సంఘాలు అంబేడ్కర్‌ విగ్రహం వద్ద గణతంత్ర వేడుకలు జరుపుతుంటే వారిని అక్రమంగా అరెస్ట్‌ చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఏపీ సీఎం చంద్రబాబు కాలం చెల్లిన విధానాలను అవలంబిస్తున్నారని ఆరోపించారు. సీపీఎం నిర్మాణాత్మకంగా బలంగా ఉందన్నారు. 47 సంవత్సరాల తర్వాత నెల్లూరులో మహాసభలను ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. మూడు రోజులపాటు నిర్వహించిన సింహపురి సాంస్కృతిక ఉత్సవాలకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభించిందన్నారు. సభలకు కేంద్ర కమిటీ నాయకులు రానున్నారని తెలిపారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, రాష్ట్ర, జిల్లా నాయకులు రమాదేవి, చంద్ర రాజగోపాల్, మోహన్‌రావు, మాదాల వెంకటేశ్వర్లు, పుల్లయ్య, అజయ్‌కుమార్, రెహానాబేగం తదితరులు పాల్గొన్నారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.30
సన్నవి : రూ.20
పండ్లు : రూ.10

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్‌ ధరలు



బ్రాయిలర్‌ (లైవ్‌) : 125
లేయర్‌ (లైవ్‌) : 85
బ్రాయిలర్‌ చికెన్‌ : 224
బ్రాయిలర్‌ స్కిన్‌లెస్‌ : 248
లేయర్‌ చికెన్‌ : 145

వన్యప్రాణులకు ముప్పు

వన్యప్రాణుల ప్రాణాలకు ముప్పు ఏర్పడింది. వాహనాలు ఢీకొని చనిపోతున్న వాటి సంఖ్య పెరుగుతోంది. ఇటీవల ఐదు సంవత్సరాల వయసున్న చిరుతపులి మరో జంతువును వేటాడుతూ నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపైకి రావడం, అదే సమయంలో వేగంగా వెళ్తున్న వాహనం ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయమై గంటకుపైగా కొట్టుమిట్టాడి మృతిచెందింది. గతంలోనూ వివిధ ప్రాణులు చనిపోయిన సందర్భాలున్నాయి.



కదిరినాయుడుపల్లి అటవీ ప్రాంతంలో జింకలు



వెలుగొండ అడవిలో ట్రీ కెమెరాకు చిక్కిన పులి

- పదుల సంఖ్యలో చిరుతల సంచారం
- రెండేళ్ల వ్యవధిలో మూడు మృత్యువాత
- నీటి కోసం వచ్చి మరెన్నో అడవి జంతువులు బలి
- పటిష్ట చర్యలు చేపట్టని అటవీ శాఖ

ఆత్మకూరు: ఉమ్మడి జిల్లాలో వెలుగొండలు, రాపూరు, వెంకటగిరి, పెంచలకోనల్లో అభయారణ్యాలున్నాయి. ఇక్కడ 1.57 లక్షల హెక్టార్ల అటవీ విస్తీర్ణం ఉంటుందని అంచనా. దీని పరిధిలో పులులు, చిరుతలు సంచరిస్తున్నాయి. రాపూరు, ఆత్మకూరు ప్రాంతంలో కలిసి ఉన్న అటవీ ప్రాంతంలో పులుల సంచారాన్ని అధికారులు గుర్తించారు. నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై రేంజ్ పరిధిలోని బాట, సింగనపల్లి, కదిరినాయుడుపల్లి, గంగుంట అడ్డరోడ్డు వరకు దట్టమైన అడవి ఉంది. అనుకూలమైన పరిస్థితులు ఉండటంతో జంతువులు అధికంగా సంచరిస్తున్నాయి. పలు సందర్భాల్లో ఆ రహదారిపై వస్తున్న వాహనదారులకు వన్యప్రాణులు కనిపించినట్లు చెప్పడం గమనార్హం.

కారణం ఏంటంటే..

30 నుంచి 40 కిలోమీటర్ల పరిధిలో తన సామ్రాజ్యాన్ని విస్తరించుకోవడం పెద్ద పులి లక్షణం. దీంతో ఆ ప్రాంతంలో అప్పటి వరకు ఉన్న చిరుతలు కొత్త ప్రాంతానికి వలస వెళ్లడం జరుగుతోందని అటవీ అధికారులు చెబుతున్న మాట. నాలుగేళ్లుగా కురిసిన వర్షాలు, అనుకూల వాతావరణం నేపథ్యంలో అటవీ ప్రాంతంలో దుప్పి, జింక, కణితి లాంటివి లెక్కకు మించి వృద్ధి చెందాయి. ప్రధానంగా వీటిని ఆహారంగా తీసుకునే చిరుతలు ఆత్మకూరు రేంజ్ పరిధిలోని అటవీ ప్రాంతంలోకి వచ్చి ఉండవచ్చని భావిస్తున్నారు. ఇదిలా ఉండగా చుక్కల దుప్పులు, జింకలు లాంటి మూగజీవాలు దాహార్తి తీర్చుకునేందుకు అటవీ సమీప గ్రామాల్లోకి వస్తున్నాయి. ఈ క్రమంలో కొన్ని కుక్కలదాడికి గురై చనిపోతుండగా.. మరికొన్ని వేటగాళ్ల దాష్టీకానికి బలైన ఘటనలు రేంజ్ పరిధిలో జరిగాయి. నాలుగు నెలల వ్యవధిలో మర్రిపాడు, అనంతసాగరం, సంగం మండలాల్లో పలు జింకలు, దుప్పులు మూడు ప్రాణాలు కోల్పోయాయి. కొన్నింటిని ఆయా గ్రామాల ప్రజలు కాపాడి అటవీ శాఖ అధికారుల సహకారంతో తిరిగి వాటిని అడవుల్లోకి వదిలారు. రెండేళ్ల వ్యవధిలో వివిధ కారణాలతో రేంజ్ పరిధిలో మూడు చిరుతలు మృత్యువాత పడ్డాయి.



ఇటీవల మృతిచెందిన చిరుత

పటిష్ట చర్యలతోనే..

వన్యప్రాణుల చట్టం ప్రకారం అడవి జంతువులకు స్వేచ్ఛగా జీవించే హక్కు ఉంది. అయితే అందుకు తగిన చర్యలను అటవీ శాఖ, హైవే అథారిటీ అధికారులు సమన్వయంతో చేపట్టాల్సి ఉంది. రహదారికి కొంత లోపల అటవీ ప్రాంతంలో జంతువులకు నీటి సౌకర్యం అభివృద్ధి చేయాలి. చిరుతలకు, పెద్ద పులులకు ఆహారమయ్యే జింకలు, కణితి, చుక్కల దుప్పులు తమ సంతతి పెంచుకునేలా పచ్చగడ్డి విస్తీర్ణాన్ని పెంచాలి. జాతీయ రహదారిపై స్పీడ్ బ్రేకర్లు తప్పనిసరిగా కనిపించేలా ఏర్పాటు చేయాలి. ముఖ్య అటవీ ప్రాంతాల్లో జంతువులు సంచరించే ప్రదేశాలను గుర్తించి రహదారులపై ఫ్లై ఓవర్లు, జంతువులు సంచరించేందుకు అండర్ పాస్‌లు ఏర్పాటు చేయాలి. తరచూ క్షేత్రస్థాయి సిబ్బంది అడవిలో తిరుగుతూ పరిస్థితిని ఉన్నతాధికారులకు వెంటనే తెలిసేలా చేయడం లాంటివి చేపడితే అడవి జంతువులను ప్రమాదాల నుంచి కాపాడేందుకు అవకాశం ఉంటుంది.

నివేదికలు పంపాం

అటవీ ప్రాంతంలోని జంతువులను కాపాడేందుకు ఆత్మకూరు రేంజ్ పరిధిలో ముంబై రహదారిపై కదిరినాయుడుపల్లి, బాట, సింగనపల్లి ప్రాంతాల్లో ఫ్లై ఓవర్లు ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం. జంతువులు సంచరించేందుకు వీలుగా ఫెన్సింగ్ ఏర్పాటు ప్రతిపాదన విరమించుకున్నాం. ఫెన్సింగ్ పెడితే వాటిని బోన్లలో వేసినట్లే. ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌ల ఏర్పాటు ప్రతిపాదనలు మరో ఆరునెలల వ్యవధిలో కార్యరూపం దాల్చనున్నాయి.

– ఎస్‌కే మహబూబ్‌బాషా, జిల్లా అటవీ శాఖాధికారి

నేర నియంత్రణకు పటిష్ట చర్యలు

- ఎస్పీ జి.కృష్ణకాంత్



మాట్లాడుతున్న ఏఎస్పీ సౌజన్య

నెల్లూరు(క్రైమ్‌): నేర నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆదేశించారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాలుకు విచ్చేసిన పోలీస్ అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నెలవారీ నేర సమీక్షను నిర్వహించారు. జిల్లా చోటుచేసుకున్న గ్రేవ్, నాన్‌గ్రేవ్, ఆస్తి సంబంధిత నేరాల్లో రికవరీలు, పెండింగ్ కేసులు తదితరాలపై సర్కిల్ వారీగా వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో నిఘా వ్యవస్థను పటిష్టం చేసుకుని నేరాలను కట్టడి చేయాలన్నారు. ప్రత్యేక కార్యాచరణతో రోడ్డు ప్రమాదాలు, అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. చిన్నపిల్లలు, మహిళలకు సంబంధించిన ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పోక్సో కేసుల్లో నిర్ణీత గడువులోగా దర్యాప్తు పూర్తి చేసి సరైన ఆధారాలతో కోర్టులో అభియోగపత్రాలు దాఖలు చేయాలన్నారు. మిస్సింగ్ కేసుల్లో ఫిర్యాదు అందిన వెంటనే దర్యాప్తును ప్రారంభించాలన్నారు. ప్రజలకు సీసీ కెమెరాల ప్రాముఖ్యతను తెలియజేయాలన్నారు. అన్ని గ్రామాలు, మారుమూల ప్రాంతాలు, వాణిజ్య సముదాయాలు, కూడళ్లు, అపార్ట్‌మెంట్లు, విద్యాసంస్థలు తదితరాల్లో విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించేందుకు చొరవ చూపాలన్నారు. రోజూ ఉదయం, సాయంత్రం విజిబుల్ పోలీసింగ్ ద్వారా ప్రధాన కూడళ్లలో వాహన తనిఖీలు నిర్వహించాలన్నారు. పగలు, రాత్రి గస్తీని ముమ్మరం చేసి రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచడంతోపాటు అనుమానాస్పద వ్యక్తుల వేలిముద్రలు సేకరించాలని సూచించారు. రహదారి భద్రతా నియమాలపై అవగాహన కల్పించడంతో పాటు తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలని చెప్పారు. జైల్ మానిటరింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. ఈగల్ బృందంను సమన్వయం చేసుకుంటూ గంజాయిని కట్టడి చేయాలన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామ సందర్శన, పల్లెనిద్రల పేరిట పోలీస్ సేవలను ప్రజలకు చేరువ చేయాలన్నారు. మార్చి 8న జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చూడాలన్నారు. పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

జైలు సూపరింటెండెంట్‌గా వెంకటేశ్వరరావు

- ఏపీ స్టార్స్‌కు రాజారావు బదిలీ



వెంకటేశ్వరరావు

నెల్లూరు(క్రైమ్‌): నెల్లూరు కేంద్ర కారాగార ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా ఎస్.వెంకటేశ్వరరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న రాజారావును మూలాపేటలోని ఏపీ స్టార్స్‌కు బదిలీ చేస్తూ జైళ్ల శాఖ డీజీ కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులు జారీ చేశారు. రాజారావు గతంలో ఏపీ స్టార్స్ ప్రిన్సిపల్‌గా పనిచేస్తూ సుమారు ఆరునెలల క్రితం నెల్లూరు సెంట్రల్ జైలు ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టారు. ఇటీవల ఆయన మాట్లాడినట్లుగా కొన్ని ఆడియోలు సోషల్ మీడియాలో వైరలైన నేపథ్యంలో ఆ శాఖ డీఐజీ వరప్రసాద్ మంగళవారం విచారణ జరిపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బదిలీ చేశారు.

కండలేరులో 54.764 టీఎంసీలు



రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 54.764 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి 180 క్యూసెక్కుల నీరు వస్తోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 650, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 200, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

హత్య కేసులో ఇద్దరికి జీవితఖైదు

నెల్లూరు(లీగల్‌): ఓ వ్యక్తిని కత్తులతో దారుణంగా పొడిచి హత్య చేశారని నమోదైన కేసులో నేరం రుజువు కావడంతో నెల్లూరు డైకస్ రోడ్డు ఎస్సీసీ కాలనీకి చెందిన నిందితులు మొగల్ అక్బర్, ఎస్‌డీ జావీద్‌కు శిక్ష పడింది. జీవితఖైదు, రూ.3,000 జరిమానా విధిస్తూ నెల్లూరు మూడో అదనపు సెషన్స్ జడ్జి ఎల్.తేజోవతి గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. నెల్లూరు విక్రమ్ నగర్ ప్రాంతానికి చెందిన మలిరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి సంగంలోని ఫెడరల్ బ్యాంక్‌లో లోన్ ఏజెంట్‌గా పనిచేస్తూ ఉండేవాడు. అతను పని నిమిత్తం 2020 డిసెంబర్ 4వ తేదీన విజయవాడకు వెళ్లాడు. పని ముగించుకుని 6వ తేదీ రాత్రి 11.30 గంటలకు తండ్రి శ్రీనివాసులురెడ్డికి ఫోన్ చేసి నెల్లూరులో దిగానని చెప్పాడు. కాసేపటికి కరెంటాఫీస్ సెంటర్ వద్ద ఇద్దరు వ్యక్తులు తనను డబ్బుల కోసం అటకాయించారని, ఇవ్వకపోవడంతో కత్తులతో దాడి చేశారని తండ్రికి ఫోన్ చేసి తెలిపాడు. ఈ నేపథ్యంలో శ్రీనివాసులురెడ్డి, బంధువులు వెంటనే కరెంటాఫీస్ సెంటర్‌కు చేరుకుని రవీంద్రనాథ్‌రెడ్డిని నెల్లూరు ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. అప్పటికే అతను చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. శ్రీనివాసులురెడ్డి వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం కోర్టులో నిందితులపై చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో పైమేరకు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ ఏపీపీ కాకుటూరు రమేష్‌రెడ్డి వాదించారు.

అధికార పార్టీ నేత దాష్టీకం



గిరిజనులు సాగు చేసుకుంటున్న నిమ్మ తోటలు

- భూములు కాజేసే ప్రయత్నం
- మనస్తాపంతో గిరిజనుడి ఆత్మహత్యాయత్నం

సాక్షి టాస్క్‌ఫోర్స్‌: గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములను కాజేసేందుకు ఓ అధికార పార్టీ నేత చేస్తున్న ప్రయత్నాలకు రెవెన్యూ అధికారులు సహకరించారు. ఈ నేపథ్యంలో ఓ గిరిజనుడు రెండురోజుల క్రితం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన సైదాపురం పంచాయతీ పరిధిలోని కమ్మవారిపల్లిలో జరిగింది. బాధితుల కథనం మేరకు.. సైదాపురంలోని 793ఏ సర్వే నంబర్‌లో 114 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. గతంలో ఇది మైనింగ్ లీజులో ఉండేది. ఆ తర్వాత గడువు ముగిసింది. ఆ భూమి సమీపంలోనే కమ్మవారిపల్లి ఉంది. ఆ గ్రామానికి చెందిన ఐదు గిరిజన, పది నిరుపేద కుటుంబాలకు చెందినవారు సదరు భూములను సాగుచేసుకుంటున్నారు. అక్కడ బోర్లను కూడా వేశారు. ఒక్కో కుటుంబానికి ఎకరా నుంచి రెండెకరాల వంతున నిమ్మ తోటలున్నాయి. పంట చేతికొచ్చే సమయంలో అధికార పార్టీకి చెందిన ఓ నేత కన్ను సదు భూమిపై పడింది. ప్రభుత్వ భూమి ఆక్రమించారంటూ పిటిషన్ పెట్టి ఉన్నతాధికారులపై ఒత్తిడి తెప్పించాడు. ఇక అధికారులు ఆ నేత చెప్పిన ప్రతి పనికీ సరేనన్నారు. నిమ్మ తోటలను సాగు చేసుకుంటున్న గిరిజన రైతులపై సైదాపురం పోలీస్‌స్టేషన్‌లో కేసును నమోదు చేయించాడు. సాగు చేసుకుంటున్న భూముల్లో ఎవరూ ప్రవేశించకూడదని సోమవారం హెచ్చరిక బోర్డులను పెట్టించి నిత్యం రెవెన్యూ అధికారుల నుంచి తీవ్ర ఒత్తిళ్లు చేయించాడు. ఈ క్రమంలో కమ్మవారిపల్లి గిరిజనవాడకు చెందిన యాటగిరి శివయ్య మనోవేదనకు గురై మంగళవారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టాడు. అతను ప్రస్తుతం నెల్లూరులో చికిత్స పొందుతున్నాడు. అతడిని గిరిజన సంక్షేమ సంఘం నేతలు పరామర్శించారు.

చర్యలు తీసుకోవాలి

సైదాపురం మండల రెవెన్యూ అధికారులను తక్షణమే విధుల నుంచి తొలగించాలి. గిరిజనుడు శివయ్య ఆత్మహత్యాయత్నానికి కారకులైన తహసీల్దార్, వీఆర్వోలపై చర్యలు తీసుకోవాలి. అధికార పార్టీ నేతతో స్థానిక అధికారులు కుమ్మక్కై, గిరిజనులు సాగు చేసుకుంటున్న కుటుంబాలను మాత్రమే టార్గెట్ చేయడం ఏమిటి? ఈ ఘటనపై విచారణ చేయాలి.

– కల్లూరు పెంచలయ్య, యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్రాధ్యక్షుడు

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్‌): యువకుడు అదృశ్యమైన ఘటనపై నెల్లూరు వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. బుచ్చిరెడ్డిపాళెంలో రాజేశ్వరి నివాసముంటున్నారు. ఆమెకు రోహిత్, హర్షిత్ అనే కుమారులున్నారు. రోహిత్ నెల్లూరు తల్పగిరికాలనీలోని తన తాత రాధయ్య వద్ద, హర్షిత్ తల్లితో కలిసి ఉంటున్నారు. హర్షిత్ ఇంటర్మీడియట్ వరకు చదివాడు. అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈనెల 26వ తేదీన హర్షిత్ తన అన్న రోహిత్ వద్దకు వచ్చాడు. రోహిత్ బయటికెళ్లి వచ్చేలోగా హర్షిత్ ఎటో వెళ్లిపోయాడు. అతను బుచ్చికి కూడా వెళ్లలేదని తల్లి ద్వారా తెలుసుకున్న రోహిత్ తమ్ముడు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. జాడ తెలియకపోవడంతో గురువారం రాత్రి వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో డ్రైవర్‌పై దాడి

నెల్లూరు(క్రైమ్‌): వరుస క్రమంలో ఆటో పెట్టే విషయంలో డ్రైవర్‌పై సహచరులు దాడి చేశారు. పోలీసుల కథనం మేరకు.. బుధవారం సాయంత్రం ఆత్మకూరు బస్టాండ్ సమీపంలోని స్టాండ్‌లో ఆటోలు సీరియల్లో పెట్టే విషయంలో డ్రైవర్ల మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో బుచ్చిరెడ్డిపాళెం శాంతినగర్‌కు చెందిన డ్రైవర్ షఫీపై సహచర డ్రైవర్లు వేణు, దిలీప్, మరో వ్యక్తి ఇనుప కడియంతో దాడి చేయడంతో అతను గాయపడ్డాడు. బాధితుడు గురువారం రాత్రి నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేసు నమోదు చేశారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సర్వర్లు డౌన్

నెల్లూరు సిటీ: ఫిబ్రవరి 1వ తేదీ నుంచి మార్కెట్ విలువలు పెరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రిజిస్ట్రార్ కార్యాలయాలకు తాకిడి పెరిగింది. జిల్లాలోని 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో గురువారం పలుమార్లు సర్వర్లు డౌన్ కావడంతో దరఖాస్తుదారులు ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇదే పరిస్థితి నెలకొంది. శుక్రవారం నెలాఖరు కావడంతో మరింత మంది రిజిస్ట్రేషన్ల నిమిత్తం వచ్చే అవకాశమున్నట్లు తెలుస్తోంది.